# 10

సెల్‌తీసి మరోసారి, ఫోను చేసాను. అతడు స్పందించలేదు.

నాకు విసుగు వచ్చింది. బాధకూడా కలిగింది. ఇన్ని సార్లు ఫోను చేసినా స్పందించక పోవటమేమిటి? మారుతికి ఏమైంది?

నేను విశాఖ రావటమే, అతన్ని కలవటం కోసం, రెండు రోజులైనాయి, వచ్చి. మారుతిని కలవలేకపోయాను. అతడేదో పనిలో వున్నాడట! పనిలోకి కూడా వెళ్ళటం లేదట!

ఏం చెయ్యాలని తోచక, బీచ్‌వారగా వుండే, రెస్టారెంటులో దూరాను. సముద్రం వైపుగా వున్న ఒక కుర్చీలో కూర్చున్నాను.

రెస్టారెంటు రద్దీగానే వుంది. కాని పూర్వం కన్నా ప్రశాంతంగా వుంది. గట్టిగా మాటలాడటం కాని, ఆనందంతో విరగపడి నవ్వటం కాని వినబడలేదు. 'టేబుల్'కి అటు, ఇటు కూర్చుని 'ఐస్‌క్రీం' తింటూ గొంతు తగ్గించి మాట్లాడుతూ వ్యవహారాలు చక్క పెట్టుకుంటున్న వారే ఎక్కువ.

"ఇరువై శాతమైతే.. ఓ.కే." నా పక్కటేబుల్ వద్ద కూర్చున్నవాడు అన్నాడు.

"మా ఎం.డి. ఒప్పుకోరేమో.." అతనికి ఎదురుగా.. కూర్చున్నవాడి మాట అది "పదికి సెటిల్ చెయ్యమన్నారు".

నేను వెనక్కు తిరిగి చూసాను. "మీరు, రేపు ఆరు గంటలకి రండి" వెనుక బల్ల వద్ద కూర్చున్న తరుణి అంది". అప్పుడైతేనే నాన్నగారు వుంటారు."

ఆమెకి ఎదురుగా కూర్చున్న యువకుడు బుర్ర ఊపాడు. అంతా వ్యాపారమే! బేరాలు కుదుర్చుకొనే తొందరలే! ఇదేనా, నేటి జీవితం!

పూర్వం ఇదే రెస్టారెంటు నవ్వులతో పిల్లల కేరింతలతో హడావిడిగా వుండేది. మారుతితో కబుర్లు చెప్పుకుంటూ గంటలు కూర్చునేవాడిని, ఇక్కడే, ఇదే కుర్చీ మీద. గట్టిగా నిట్టూర్చాను. సముద్రం వైపు దృష్టి మళ్లించాను.

వెన్నెల వెలుగుని అందుకునే సముద్రం, నేటి జీవితంలా, అల్లకల్లోలంగా వుంది. తాహతకు మించి ఎగిసిన అలలు నడుము విరిగి ఇసుకలో పడి దొర్లి దొర్లి ఏడిస్తున్నాయి.

మారుతిని కలవటం కోసమే, విశాఖ వచ్చాను. ఆరు నెలల క్రితం పదవీ విరమణ చేసి మా ఊరు వెళ్లాక అతనిని కలవలేదు. విశాఖ వస్తున్నట్టు, అతనికి ముందుగానే తెలియపరిచాను. అయినా...

మళ్లీ సెల్ నొక్కాను. స్పందన లేదు. విసుగ్గా, సెల్ పాకెట్‌లో పెట్టుకొని ఆలోచనలో పడ్డాను.

నాకు మారుతితో, ఇరువది సంవత్సరాల సాన్నిహిత్యం. విశాఖ వచ్చి కొత్త ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లోనే పరిచయమయ్యాడు, మారుతి, చేసే ఉద్యోగాలని బట్టి, అతనికి, నాకు పరిచయం ఏర్పడవలసిన అవసరం లేదు. మా కర్మాగారంలో ఒక టెక్నిషియన్‌గా పని చేసేవాడు అతడు. పర్సనల్ ఆఫీసర్‌గా చేరాను నేను. మారుతి మొదటిసారిగా నన్ను కలసిన రోజు నాకు ఇంకా బాగా గుర్తే!

పగలంతా పని చేసి అలసిపోయిన సూర్యుడు, విశ్రాంతి తీసుకునే ముందుగా, పశ్చిమాబరంలోని ఎర్రమబ్బుల గులాబితోటలో వుండే సమయమది.

కర్మాగారం నుంచి ఇంటికి వచ్చి కొత్తగా దిగిన మా ఇంటి

తోటలో గులాబి మొక్కలు, నాటుతూ వుంటే వచ్చాడు మారుతి. అతడే, అతని పరిచయం చేసుకున్నాడు. తెచ్చిన "కేజీ" స్వీటుపాకెట్టు" ఇచ్చాడు. ఉద్యోగులతో సత్సంబంధాలు పెంపొందించటం నా విధి నిర్వహణలో, భాగం కనుక, సహజమైన చిరునవ్వుతో ఆహ్వానించాను. చాలా విషయాలు మట్లాడాడు మారుతి. కర్మాగార చరిత్ర గురించి చాలా చెప్పాడు. ఏ అవసరం వచ్చినా సహాయం చెయ్యడానికి సిద్ధంగా వున్నట్టుగా నొక్కి వక్కాణించాడు. అతని సరస సంభాషణం నన్ను ఆకట్టుకుంది. రెండు గంటల తరువాత మారుతి మా ఇంటి నుంచి బయలుదేరినప్పుడు ఇంటినిండా వెన్నెలే!

తరచూ, ఇంటికి వస్తూ వుండేవాడు మారుతి. కాలక్షేపానికి, టీవీలు లేని రోజులు అవి. హృదయం విప్పి మాట్లాడి ఆనందించడానికి స్నేహితులని, చుట్టాలని తరచూ కలుసుకునే రోజులు. విశాఖలో అప్పుడప్పుడే, నిలదొక్కుకునే నాకు, మారుతి రాక, కొంత కాలక్షేపంగా వుండేది. అతని ద్వారా కర్మాగారంలోని వారు, నా చర్యల గురించి స్పందించే తీరు కూడా తెలిసేది. త్వరలోనే ఇంటిలో మనిషి అయ్యాడు మారుతి.

"ఆ సంచి ఇలా ఇవ్వండి" ఒక ఆదివారం సంచి పుచ్చుకొని బయలు దేరుతుండగా వచ్చాడు మారుతి. "ఏం కావాలో చెప్పండి.. నేను తెస్తానుగా"

నేను సంకోచించాను. సాధారణంగా, అప్పటికే, పెరిగిన మైత్రివల్ల, పని అతనికి అప్పగించే వాడిని. కాని.......

"ఇలా ఇవ్వండి, సార్" మారుతి మళ్ళీ అన్నాడు. "నేను వచ్చానుగా" బలవంతం చేసాడు. అతడు.

నేనేమి అనలేదు. మారుతిని ఒకసారి చూసాను. ఎప్పటిలాగే

అతని నుదుటి మీద వీభూది రేఖలు కనబడుతున్నాయి. కుంకుమ బొట్టు కూడా వుంది. "కోడి మాంసం గురించి.. ఆదివారం కదా.."

"ఓ... అందుకా సంకోచిస్తున్నారు.." మారుతి నవ్వుతూ అన్నాడు. ఏం పర్వాలేదు. ఎంత కావాలో చెప్పండి."

సంచి పుచ్చుకొని బయలు దేరాడు అతడు.

కోడిమాంసమే కాదు, కర్మాగారంలో జరిగే మాకు తెలియని విషయాలు మా చర్యలపై కార్మికుల స్పందన వగైరాలు కూడా మోసుకువచ్చేవాడు, మారుతి. మాలాంటి పర్సనల్ ఆఫీసర్లు తమ విధిని సమర్థవంతంగా యాజమాన్యంవారు మెచ్చుకునే విధంగా నిర్వహించాలంటే కొందరు మారుతీలు వుండాలి. వారిని యాజమాన్యం వారు గూఢచారులుగా వాడుకుంటారు. అది వారికి తెలియదు. ప్రమోషన్‌లకి పలుకుబడికి ఆశపడి మా చుట్టూ తిరుగుతూ వుంటారు, వాళ్ళు. మారుతి విషయంలోనూ, అదే జరిగింది. అతడు పని చేసే విభాగాధిపతి సిఫార్సు చెయ్యక పోయినా, బలవంతంగా సిఫార్సు చేయించి ప్రమోషన్ ఇచ్చాము. ఆ తరువాత మరీ విధేయుడుగా మారాడు మారుతి.

మారుతితో ఏర్పడిన మైత్రి పెరిగింది. నా కుటుంబ సభ్యులు కూడా మారుతిని ఇంట్లో మనిషిలాగే భావించే వారు మా పిల్లలైతే మామయ్య మామయ్య అని అతని చుట్టూ తిరిగే వారు ఒక సారైతే నేను మా ఆవిడ తప్పని పరిస్థితిలో ఊరువెళ్లవలసి వచ్చినప్పుడు, వారం రోజులు మారుతి మా ఇంటిలోనే ఉండి పిల్లలని చూసుకున్నాడు. ఆ సంగతి తెలిసిన మా అత్తగారికి కోపం వచ్చింది కూడా. "కబురుపెడితే నేను వచ్చేదాన్నిగా. ఈడు వచ్చిన ఆడపిల్లలని ఎవరికో అప్పగించి వెళ్తావా" అంది.

"ఎవరో కాదు, అమ్మమ్మా, మామయ్యే" అని పిల్లలంటే

"ఎవడే ఆ మామయ్య?" అత్తగారు కోపంతో ఊగిపోయారు.

"నాకు తెలియకుండా ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాడే, ఈ మావయ్య?"

పదవీ విరమణ చేసి ఊరువెళ్లిపోయాను. ఆ తరువాత మారుతి కనబడలేదు.

విశాఖలో చిన్నపని వుండి వచ్చాను, ఇప్పుడు అయినా ముఖ్య ఉద్దేశం మారుతిని కలవటమే.

రెస్టారెంటులో కలుద్దామని అన్నాడు "బిజి"గా వున్నాడట!

ఇంకారాలేదు, ఏమైందో ఏమో..! చుట్టూ చూసాను. పదవీ విరమణ చేసినవాడి జీవితంలా రెస్టారెంటు ఖాళి అయిపోయింది. బీచ్‌లో రద్దీ తగ్గిపోయింది.

మరోసారి ఫోన్ చేసాను. స్పందన లేదు. బరువెక్కిన మనస్సుతో, ఖాళీలైన బల్లలని దాటి దాటి బీచ్ లో అడుగు పెట్టాను. చాలా దూరం నడిచాను. బీచ్‌లో రద్దీ తగ్గిపోయింది.

బీచ్ నుంచి రోడ్డు మీదకు మెట్లు ఎక్కుతూ వుంటే వినబడ్డాయి ఆ మాటలు.

"నీ" గాడ్ ఫాదర్ వచ్చారట కదరా, మారుతీ, కలిసావా?"

"లేదురా" అది మారుతి గొంతే" ఫోను చేస్తునే వున్నాడు, పాపం, కాని మనకెక్కడదీటైం. కొత్తపర్సనల్ ఆఫీసర్ ఆసుపత్రిలో వున్నాడు కదరా, చూసుకోవొద్దూ?"

"అదేంటిరా, పాపం అతడు నీకు ఎంతో చేసాడు. నీ గురించి రూల్సు మార్చి ప్రమోషన్ ఇప్పించాడు. ఖాళీ చేసుకొని కలవాలిగాని... రేపు వెళ్లిపోతాడట..."

"పోనీరా.. ఇంకా మనకు అతనితో పనేమిటి? పదవీ విరమణ చేసినవాడు. కొత్త ఆఫీసర్‌ని జాగ్రత్తగా చూసుకుంటేనే కదరా మన ఉద్యోగంలో మరికొంత వృద్ధి.. అయినా పడ్లుండే చెట్టుపైనే కదరా చిలకలు వాలేది.. మోడువారిన చెట్టుపైన కాదు"....

నేనలా వుండిపోయాను.. మారుతి చూపిన స్నేహం అభిమానం స్వలాభం గురించేనా.. అభినవ మారుతిని చూసి అలనాటి మారుతి అని పొరబడ్డాను.

లోగుట్టు పెరుమాళ్లకెరుక!